సుందరరాజు గదినిండా సిగరెట్ పొగ.

అలవాటులేని నాగభూషణంగారు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. మధ్య మధ్య విసుక్కుంటున్నారు.

"రాజా! చస్తున్నాను, బాబూ, ఈ పొగతో! పాముకైనా పొగబెట్టారట! నా కసలే ఒంట్లో బాగుండలేదు! ఈ మేళ మేదో కానిస్తే, దబ్బున ఇంటికి పోతాము!" అన్నారు నాగభూషణంగారు చిరాగ్గా.

గదిలో ఉన్న వాళ్ళంతా బాంక్ ఉద్యోగులు. దీపావళికి నాటకం వెయ్యాలని ప్లాన్. కొత్తగా వచ్చిన ఏజెంట్‌ది కాస్త యువకరక్తం. గానుగెద్దుల్లాగ పనిచేసి కొంపలకు పోవడం అంటే ఆయన కాస్త గిట్టదు. మనిషికి పనితో పాటు రిక్రియేషన్‌కూడా అవసర మంటాడు. బాంక్ సిబ్బందితో బాడ్మింటన్, క్రికెట్ ఆడించిన ఘనత ఆయనకే దక్కింది.

అట్లాంటి ఆఫీసర్‌ను మెప్పించటానికి బాడ్మింటన్, క్రికెట్ రానివాళ్ళంతా నాటకం వేసి మెప్పించాలని నిర్ణయం తీసుకున్నారు.

నాటక రచయిత నాగభూషణంగారే. ఆయునని నాలుగు గేయాలూ, ఒక కథ అచ్చులో వచ్చాయి. అందుకని ఆయనే నాటక రచయిత కావాలి అంటూ ఏక గ్రీవంగా తీర్మానించారు.

ఈ వేళే రిహార్సల్స్ ప్రారంభం.

"ఏమయ్యా! ఇక మొదలుపెడదామా?" అన్నారు రచయిత.

"ఆహా! మీదే ఆలస్యం! ఇంకా ఆలస్యమైతే ఇంకో కాఫీ దండగ. పైగా మా ఆవిడతో ఆలస్యానికి చీవాట్లు! దీపావళిదాకా ఈ నాటకం సంగతి యమ సీక్రెట్‌గా ఉంచమంటిరి! కానివ్వండి. మొదలుపెడతామా? నాగభూషణం గారూ! ఏమున్నా దేనిటి రోగ్గట?" అని అడిగాడు నాగేశ్వరరావు.

"ఆఁ ఏముందది! గుండె బలహీనంగా ఉందట. కాస్త జాగ్రత్తగా ఉండాలట. ఏవో మందులు రాసి ఇచ్చాడు. కాస్తంత ఒళ్ళు బాగా లేకపోతే, గుండె జబ్బని అదరగొట్టటం ఈ కాలం కుర్రడాక్టర్లకు అలవాటయిందయ్యా! కానియ్యండి. ఈ వేళ పాత్రల్ని నిర్ణయించుకొని లాంఛనంగా రిహార్సల్స్ మొదలుపెడదాము. రేపటినుంచి రెగ్యులర్‌గా వేద్దాము గాని" అన్నారు నాగభూషణంగారు.

"నాటకం పేరేమిటి? ఎన్ని పాత్ర లున్నాయి?" అని అడిగాడో యువక క్లర్క్.




# నాటకం

చెరుకూరి కమలామతి

"నాటకం పేరు 'కట్నం లేని పెండ్లి'. పాత్రలు స్త్రీలువా? ఇత్తడివా?" నవ్వుతూ అన్నాడు సుందరరాజు.

"పాత జోకే" అందో యువక రక్తం.

"ఇదిగోనయ్యా! మా అమ్మాయి పురుషపాత్రలూ, స్త్రీ పాత్రలూ అన్నీ వివరంగా రాసి పెట్టింది" అన్నారు నాగభూషణంగారు.

"ఆహా! అయితే, ఇంట్లో సెన్సార్ అయిందన్న మాట! మీ ఆవిడకూడా చదివిందా నాటకాన్ని?" అని అడిగాడు నారాయణరావు నవ్వుతూ.

"చదవడమేమిటి? నాటకం అసహజంగా ఉందని తల్లీ కూతుళ్ళు ఒకటే గొడవ. రచ్చ చేశారు! ఆ సోదెందుకు గాని, నారాయణరావూ, నేను పెళ్ళి కూతురి తండ్రిని. నీవు తల్లివి. ఈ రెండు పాత్రలూ మనిద్దరం తీసుకుందాం. మిగతావి ఎవళ్ళ కిష్టమైనవి వాళ్ళు ఎన్నుకుంటారు. ఊఁ కానియ్! ముందు మనిద్దరిదీ చూద్దాము! అసలే పొద్దు పోయింది!" అన్నారు నాగభూషణంగారు.

"మీ కేం, సార్! ఇళ్ళ దగ్గర కాచుకొని ఉంటారు. మేము ఆలస్యంగా హోటల్‌కు పోతే అంతా చద్దివి మిగిలి ఉంటాయి!" అన్నాడు యువక క్లర్క్.

"రైట్! ఇక మొదలు పెట్టుదాము!" అన్నాడు నారాయణరావు.

"ఏమిటే! అట్లా ఆముదం తాగిన ముఖం పెట్టావు! 'ఈడుపుకాళ్ళూ ఏడుపుమొగమూ' అని బండెడు చాకిరీ ఆఫీస్‌లో చేసి కొంపకొస్తే, ఏడుపు గొట్టుముఖంతో ఎదురుపడతా వెందుకే!" తండ్రిగా నటిస్తూన్న నాగభూషణం గారి గొంతులో కోపం, చిరాకూ అంత బాగా కనపడడం లేదు.

"అబ్బే! గొంతులో కాస్త లైఫ్ ఉండాలండీ!" అంది యువక రక్తం.

"అదే వస్తుంది లేవయ్యా! ఇంకా ఇది మొదటి రోజేగా? ఊఁ పోర్షన్ చదువు, నారాయణరావూ!" అని హెచ్చరించారు నాగభూషణంగారు.

"అవునండీ! మీకు ఆఫీసు తప్ప రెండో ప్రపంచకమేముంది! గుండెల మీది కుంపటల్లే ఎదిగిన పిల్ల ఉందే, దాని పెళ్ళి ఏమిటని ఎప్పుడేనా ఆలోచించారా? ఎన్నిసార్లు మొత్తుకొన్నా నా మాటలు చెవిని వేసుకొంటారా? తెల్లవారి లేస్తే పడుకొనేదాకా ఆఫీసని కలవరసుయితే!"...

రాజా గదిలో గోడకు వేలాడుతున్న జఘనసుందరిని చూస్తూ, నారాయణగారు పోరన్ విని యువక కర్—



కనుమ ఫోటో — బి. ఎస్. ఆర్. చంద్రన్ (బాపట్ల)

"అబ్బే! శుభ్రంగా మగ గొంతులో చదివారేమిటండీ! అది ఆడపోర్షను కాదూ?" అన్నాడు.

"మీరేనిటయ్యా పక్కన! అమాంతంగా ఆడగొంతు వస్తుందటయ్యా! రేపు ప్రాక్టీస్ చేస్తాలెండి! ఇట్లా అడ్డు గొడుతూ ఉంటే తెల్లారినట్లే నాటకం!" విసుక్కుంటూ అన్నాడు నారాయణరావు.

"కానియ్యండి, నాగభూషణం గారూ!" సుందరరాజు హెచ్చరించాడు.

"రోజూ ఉన్న ఏడుపేగా ఇది! ఈ వేళ కొత్తగా గుండెల మీది కెక్కిన కుంపటే ముందని గొడవ పెడుతున్నావే! ఈ ఒక్క రోజులో అది ముదిరి బెండకాయ అయిందటే!" నాగభూషణంగారి గొంతులో కోపం బాగానే కనపడింది.

"అంతేలెండి! కొంపలంటుకు పోయాక మీరు చేసేదేమిటి? నేను చూసే దేమిటి? ఎస్. ఎస్. ఎల్. సి. పాసయినాక ఇంట్లో కూర్చోపెట్టమంటే —అబ్బా, కూతురూ కలిసి నన్ను కొట్ట వచ్చారు! పైపురైటింగంటూ దించితిరి! అక్కడ ఇది చిత్రాంగి వేషం వేస్తున్నదట! వెంకమ్మ పిన్నితో వాళ్ళబ్బాయి అన్నాట్ట! మూడు రోజుల కిందట ఎవతో స్నేహితురాలితో సినిమా కెళ్ళానని కూసిందే! అది ఎవడో కుర్రాడితోనట! 'మీరు గనక జాగ్రత్త పడకపోతే ఇంటి పరువు రచ్చ కీడుస్తుందే అమ్మాయి!' అని మరీ మరీ చెప్పిపోయింది పిన్ని. రేపేదన్నా వెధపని చేసిందంటే ఇద్దరం గంగలో దిగాలి! అంతెందుకు? ఏడు దాటుతున్నదా? అదింకా కొంప చేరలేదు చూడండి! ఆడపిల్లకి తిరుగుళ్ళేమిటని దాన్ని ముక్క చీవాట్లు వెయ్యక, ఇట్లా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటే పనులు జరుగుతాయా!"

"ఓసి నీ దుంపతెగా! ఎంత పెద్ద లెక్చరు దంచావే! ఇంకా ఏమిటోనని హడిలి చచ్చా! వెర్రిపీనుగా! పిల్లకి పెళ్ళి చెయ్యటం అంటే మాటలా? నీ బాబు దాచిన ముల్లె ఏమన్నా ఉందా? ! ఏ బ్రాహ్మడికో నాలుగో, అయిదో వేలు పోసి కొనుక్కురావాలి! నా వల్ల అయ్యే పనేనా? అదిగాక. . ."

"అందుకని దాన్నిట్లా గాలికి వదులుతారా! కన్నతండ్రిగా ఇట్లాంటి ఆలోచన లేనా చెయ్యవలసింది!"

"అన్నింటికీ ఆత్రమేనుటే? విను! పిల్లని కాస్త కెక లెయ్యి! ఈ నెల అయిపోతూనే టైపు మానిపించుతానని బెదిరించు! నాతో చెప్పి చెమ్డాలూడ దీస్తానని చెప్పు!. . ."

"అయ్యో, నా నెత్తిరాతా! చెట్టంత మీరుంటే, నేను కోప్పడడమేమిటి? అక్కడికి నా మాటంటే దానికి భక్తీ, భయమూ ఏడిసినట్లు!"

"నోరు మూసుకొని వినవే! నువ్వు బెదిరించేటప్పటికి, అది కాస్తా వాడితో లేచిపోతుందే!"

"శివశివా! అది జరుగుతుందనేగా నా ఏడుపు!"

"ఓసి, పిచ్చిమొద్దూ! అంతకంటే కావలసిన దేముందే! ఓ వారం రోజు లాగి, పిల్లనూ పిల్లాడినీ ఇంటికి తెచ్చుకొని రిజిస్టర్ ఆఫీస్‌లో సంతకాలు చేయిద్దాము. పిల్లాడిని మన ఇంట్లోనే ఉంచుకొని ఉద్యోగం ఇప్పిద్దాము. అబ్బాయి తల్లీ, తండ్రీ గొడవ చేస్తే కోర్టు కెక్కుతానని బెదిరిస్తా! వాళ్ళ పిల్లాడిని జైల్లో కుక్కుతారు కాబట్టే నోరుమూసుకుంటారు! పిల్లాడిని కోప్పడకుండా సకల మర్యాదలూ చేస్తాము కాబట్టి, ఉద్యోగం ఇప్పించాము కాబట్టి, వాడూ మన మంటే ఇదిగా ఉంటాడు! ఇది బ్రహ్మాండమైన పథకమే! దీనికంతా ఖర్చు మహా అయితే ఓ అయిదు వందలవుతుంది! ఇంకేం మాట్లాడకు! పిల్లాడు బ్రాహ్మణుడేలే! నాకూ తెలుసులేవే ఈ సంగతి! కావాలనే ఊరుకున్నాను! గప్‌చుప్‌గా నే చెప్పినట్లు చెయ్యి. చిలకా గోరింకలల్లే కూతురూ అల్లుడూ నట్టింట్లో తిరుగుతారు. కాదన్నావా, ఈ జన్మకు దాని పెళ్ళి చెయ్యడం నా తరం కాదు."

"ఇదెక్కడి అప్రతిష్ఠ పనులండీ! పిల్ల లేచిపోయిందని నలుగురూ ఉమ్మరూ?"

"సింగినాదంకాదూ! లేచిపోయిన వాడితోనేగా మనం పెళ్ళి చేసేది! ప్రతిష్ఠ కోసం కూర్చుంటే నీ కూతురి పెళ్ళి అయినట్లే! నిజం చెప్పాలంటే, ప్రతి ఆడపిల్లా ఇట్లా బరితెగించితే, తలిదండ్రుల ప్రాణాలకు సుఖంగా ఉంటుంది కదే!"

"మరే! ప్రతి తండ్రీ మీ లాగే సిగ్గు విడిచి, కూతురు లేచిపోతే చాలను కొంటారా? పరువూ, మర్యాదా లేకపోతే సరి!"

"అవునులే! పరువూ, ప్రతిష్ఠా నీ కూతురికి మొగుణ్ణి తెస్తాయి! నోరు మూసుకొని నే చెప్పినట్లు చెయ్యి!"

వింటున్న వాళ్ళంతా చప్పట్లు కొట్టారు.

"బ్రహ్మాండమైన ప్లాన్, సార్. రెవల్యూషనరీ మెథడ్! ఆడపిల్లలు లేచిపోవటానికి తగిన వాతావరణాన్ని సృష్టించి కులాల ప్రసక్తి లేకుండా వాళ్ళతోటే పెళ్ళి చెయ్యడం వండర్‌ఫుల్ ఐడియా! వెరీ ప్రాక్టికల్!" అంది యువక రక్తం ఆవేశంగా.

"కబుర్లు చెప్పడానికేమయ్యా! కూతురు లేచిపోతే ఏ తండ్రి సంతోషిస్తాడు! అసలు లేవదీసుకుపోయే గుండె నిబ్బరం, లేచిపోయే నిబ్బరం ఎంత మందికుంటుందయ్యా! ఇది నాటకం కాబట్టి మెచ్చుకొంటున్నా రంతే!" అన్నాడు నారాయణరావు నవ్వుతూ.

# సంక్రాంతి వేడుకలు



ఆ రోజు సంక్రాంతి రోజు — తెలుగు ప్రజల వేడుకల్లో ఆశల కాంతులు ముత్యాల ముగ్గులు పెట్టిన రోజు— మద్రాసు ప్రజల స్వంత భవన నిర్మాణ ఆశయానికి విజయాక్షతలు చల్లిన చల్లని రోజు.

'కళావాహిని' ద్వితీయ వార్షికోత్సవంలో మద్రాసు ముఖ్యమంత్రి ప్రధాన అతిథిగా పాల్గొనడం, తెలుగు, తమిళ ప్రజల భాషా సంస్కృతుల సాన్నిహిత్యాన్ని శ్రీ కరుణానిధి ఉగ్గడించడం నిజంగా గర్వకారణం.

ఆహూతులను ఉద్దేశించి శ్రీ కరుణానిధి మాట్లాడుతూ తెలుగువారికి ఒక స్వంత భవనం కావాలన్న కోర్కె తమకు తెలుసునని పేర్కొంటూ అందుకు స్థలం ఇవ్వడానికి చూస్తామని వాగ్దానం చేశారు.

శ్రీకరుణానిధికి 'కళావాహిని' అధ్యక్షులు శ్రీ బి. కృష్ణమూర్తి, కళాపోషకుడు శ్రీ పి. వి. రమణయ్య (రాజా), శ్రీ పి. బ్రహ్మయ్య, శ్రీ పి. మోహన్‌రావు ప్రభృతులు స్వాగతం పలికారు.

నగరంలో ఉన్న పలు తెలుగు సంస్థల పక్షాన శ్రీ కరుణానిధికి పుష్పమాలలు వేశారు.

'కళావాహిని' అధ్యక్షులు శ్రీ బి. కృష్ణమూర్తి స్వాగతోపన్యాసం ఇస్తూ 'కళావాహిని' చేసిన, చేస్తున్న కృషిని వివరించారు. మద్రాసు నగరంలో తెలుగు వారికి ఒక థియేటర్ కావలసిన అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

'కళాభారతి' అధ్యక్షులు శ్రీ పి. బ్రహ్మయ్య అధ్యక్షోపన్యాసం ఇస్తూ తెలుగు సంస్థల మధ్య సహకారాన్ని సూచిస్తూ, నగరంలో తెలుగు సాంస్కృతిక సంస్థల కృషిని వివరించారు.

'కళావాహిని' మెంబర్ ఇన్‌ఛార్జి శ్రీ పి. మోహన్‌రావు తెలుగువారి కార్యక్రమంలో వచ్చి పాల్గొన్న ముఖ్యమంత్రిని అభినందించారు. వందన సమర్పణ చేశారు.

సినీనటి కుమారి చంద్రకళ లక్కీడిప్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

వార్షికోత్సవ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌ను ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి విడుదల చేసి, కార్యక్రమంలో పాల్గొన్న తమిళనాడు మంత్రి శ్రీ ఎస్.వి. నటరాజన్‌కు మొదటి కాపీని అందించారు.

శ్రీ ఆనంద్, శ్రీ ప్రదీప్‌కుమార్, జ్యోతి ఖన్నా, గిరిజలు లలిత సంగీతకచేరీ చేశారు. అనంతరం నాట్యాచార్య శ్రీ ఎస్. ఎస్. శైవా ఆధ్వర్యంలో ఆతని శిష్యుడు చిరంజీవి డి. వి. రమణ నృత్యప్రదర్శనలు ఇచ్చాడు. తరవాత నాట్యాచార్య వెంపటి చినసత్యం శిష్యురాలు శ్రీమతి పద్మ నృత్యప్రదర్శనలు ఇచ్చింది. హైదరాబాద్ సాంగ్ అండ్ డ్రామాకు చెందిన శ్రీ బి. సుబ్బారావు మోనో-యాక్టింగ్ చేశారు. చిరంజీవి పి. సాయికుమార్ 'మయసభ' చక్కగా ప్రదర్శించాడు.

అరువ కామేష్, రాజామణి బృందం వారు హిందీ పాటలు పాడి ప్రేక్షకులను ఆనందపరిచారు.

'తెనాలి రామకృష్ణ' తెలుగు సినిమా ప్రదర్శనంతో వేడుకలు సమాప్తం అయాయి.

— ఎల్లోరా

---

"నారాయణరావూ! కూతురు లేచి పోతే, గుండ్రాయల్లే ఉండే తండ్రి అసలు సృష్టిలోనే ఉండడని నా భార్యా, కూతురూ ఛాలెంజి చేశారు!" అన్నారు నాగభూషణంగారు.

"మీ రేమన్నారు?" నారాయణరావు అడిగాడు.

"మనం చదువుకొన్న వాళ్లం కాబట్టి పరిస్థితుల ప్రకారం మారాలి అన్నాను."

"సార్! హోటలు మూసే వేళయింది! మీ కేం! ఇంటి దగ్గర ఎదురుచూచే వాళ్లుంటారు! మా తిప్పలు మీ కేం తెలుస్తాయి! ఇక పదండి, సార్!" అన్నాడు రాజు.

కొద్ది నిమిషాల్లో గది ఖాళీ అయింది.

* * *

ఆలోచనల్లో మునిగిపోయి, వీధి లైటుకూడా గమనించకుండా నడుస్తున్నారు నాగభూషణంగారు.

బాంక్ ఉద్యోగమన్న పేరేగాని, ఆస్తంటూ తనకు మిగిలిన దేమిటి, ఒక ఇల్లు తప్ప? ఎదిగిన చెల్లెల్ని తన నెత్తి మీదికి వదిలి, తల్లీ తండ్రీ ఏడాది తేడాలో పోతే, ఆ చెల్లెలి పెళ్లి చేసి పంపేటప్పటికే తల ప్రాణం తోకకొచ్చినంత పనయింది! ఈ నాటికీ ఇంకా అది లేదు, ఇది లేదని చెల్లెలి అత్తగారింటివాళ్లు సాధిస్తూనే ఉన్నారు. ఇంతలోనే కొంప లంటుకుపోయినట్లు కూతురు పెళ్లి కెదిగి కూర్చుంది! కొంతమంది ఆడపిల్లలు చక్కగా చదువుకొని ఉద్యోగాలు చేస్తూ తండ్రికి ఆసరాగా ఉంటారు. తన కూతురికి ఆ చదువు కూడా బ్బలేదు! ఎస్. ఎస్. ఎల్. సి. తప్పి ఇంట్లో తిని, కూర్చుని ఎదిగి పోతున్నది!

ఇప్పుడు పిల్ల పెళ్లి చెయ్యాలంటే ఇల్లు అమ్మ వలసిందే! అదీ చాలదు! ప్రావిడెంట్ ఫండ్ నుండికూడా అప్పు తెచ్చుకోవాలి! ఇల్లమ్మితే తనకూ, కుటుంబానికీ నిలవ నీడ ఏది?

నాటకంలో వ్రాసినట్లు తన కూతుర లేచిపోతే?

మళ్లీ గుండెలో కలుక్కుమని నొప్పి జలజలమని నీటి చుక్కలు పడడంతో తలఎత్తి చూశారు నాగభూషణంగారు. మబ్బులు... తెల్లని చందమామను మింగిన నల్లని మబ్బులు.

'ప్రతి మబ్బుకూ ఒక వెండిఅంచు ఉంటుంది!' అన్న ఇంగ్లీషు సామెత గుర్తుకు వచ్చింది. తన మనస్సులో కమ్మిన మబ్బుకుకూడా ఏదన్నా సిల్వర్ లైనింగ్ ఉందేమో?

పరధ్యానంగా ఇంట్లో అడుగు పెట్టిన నాగభూషణంగారు భార్య మాటలతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు.

"కొంప మునిగిందండీ! పరువు సక్కట కలిసిపోయింది!"

గుండెలో పోటు! పిచ్చిగా భార్య వైపు చూశారు నాగభూషణంగారు.

"అట్లా పిచ్చి చూపు లేమిటండీ! మన లల్లి పక్క వీధిలో ఉన్న కుర్రాడితో రైలెక్కిందట! చాప కింద నీరులాగా నెమ్మదిగానే కొంప ముంచిందండీ! వెళ్లి సంగతేమిటో కనుక్కొని రండి!"

కూతురు లేచిపోతే, తల్లి దేరామేకల్లే కంట్లో నీళ్లుకూడా లేకుండా మాట చెబుతున్నదన్న ధ్యాసకాని, తన గుండెల మీది కుంపటిని ఆర్పుతగా కూతుర ఎవడితోటో లేచిపోయిందన్న ఆనందం కానీ 'కట్నం లేని పెళ్లి' నాటక రచయితకు కలగలేదు.

లేచిపోయిన కూతురి తండ్రిగా ఈ ముఖాన్ని రేపు లోకానికి చూపటం ఎట్లా అన్న బాధ ఒక పక్క, కూతురి పెండ్లి కోసం ఇల్లమ్ముకోవలసిన అవసరం లేదన్న ఆనందం ఇంకొక పక్క నాగభూషణం గారి గుండెను పిండాయి.

తూలి, నిలువునా పడిపోతున్న భర్తను పట్టుకొని కంగారుగా— "అయ్యో!! అదేమిటండీ! అట్లా పడిపోతున్నారు! లల్లీ! ఇవతలకు రా! నాన్నగా రేమిటో హఠాత్తుగా పడిపోయారు! పరుగెత్తుకు పోయి డాక్టరును అర్జెంటుగా తీసుకురా!" అని అరిచింది నాగభూషణంగారి భార్య. భర్త స్థితిని చూసేసరికి ఆవిడకు గుండె పగిలిపోతున్నది.

రివ్వున పరుగెత్తింది లల్లీ డాక్టర్ కోసం.

నాగభూషణంగారికి ఇక ఏ డాక్టరూ అవసరం లేదని కంగారులో ఆ ఇద్దరూ గమనించలేదు! *